క్లుప్తంగా

ఎన్నికల ముసాయిదా జాబితా ప్రదర్శన



నడికూడ : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు, పోలింగ్ స్టేషన్ల జాబితాను బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ విమల ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 47 పోలింగ్ స్టేషన్లు, 27,485 ఓటర్లు ఉండగా, మండలంలో 10 ఎంపీటీసీ, 1 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు.

టిప్పర్లు సీజ్

నడికూడ : మండలంలోని ధర్మారం గ్రామం వద్ద పరకాల పోలీసులు బుధవారం పెట్రోలింగ్ చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను గుర్తించారు. స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పరకాల పోలీసులు తెలిపారు.

కోతిని రక్షించిన స్థానికులు

శాయంపేట : మండల కేంద్రంలోని స్థానిక బాలుర పాఠశాల క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ నెట్‌కు కోతి మెడ బిగుసుకుపోయి చనిపోయే దశలో ఉన్న కోతిని స్థానికులు బాసాని వెంకన్న, చింతల రవిపాల్ గమనించి నెట్ నుంచి కోతిని తీసి సీపీఆర్ చేసి బతికించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జమీయతుల్ ఉలమా హింద్ కమిటీ ఎన్నిక




అధ్యక్ష,కార్యదర్శులు కలాం, జహంగీర్

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జామియా మజీద్ ఆవరణలో జమీయతుల్ ఉలమా హింద్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ము జాహిద్, మహ్మద్ దిల్షాద్ ఆధ్వర్యంలో బుధవారం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ అబ్దుల్ కలాం, ఉపాధ్యక్షులుగా షేక్ మొయినొద్దీన్, ముంతాజ్ ఆలం, కార్యదర్శిగా మహ్మద్ జహంగీర్(చోటు), సహాయ కార్యదర్శిగా సయ్యద్ అబ్దుల్ గఫూర్, కోశాధికారి మహ్మద్ సాదిక్ పాషాతో పాటు కార్యవర్గ సభ్యులుగా మహ్మద్ యాసీన్ మియా, షేక్ గఫూర్, మహ్మద్ యాకూబ్, లాల్ మహ్మద్, సయ్యద్ అబ్దుల్లా, ఎండీ అంకూస్, మహ్మద్ రఫీలను ఎన్నుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



పరకాల: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ కె.సుష్మా అన్నారు. 1వ వార్డులో ఇల్లులేని నిరుపేదలకు బుధవారం ఆమె మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ తో కలిసి మంజూరు పత్రాలు అందజేశారు. వారి వెంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

పరామర్శ



పరకాల : కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ జెడ్పీటీసీ సిలువేరు మొగిళిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం పరామర్శించారు. మొగిళి ఆరోగ్య పరిస్థితి గురించి ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

నడికూడ : మండలంలోని చౌటుపర్తి గ్రామానికి చెందిన వేల్పుల శృతి (అడ్వకేట్) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం గతంలో పరకాల ఎస్సైగా పని చేసి, ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై సుధాకర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

శిక్షపడిన ఖైదీల తరలింపు

ఆత్మకూరు : కొంతకాలం క్రితం జరిగిన కేసులో శిక్షపడిన ఖైదీలను వరంగల్ కోర్టుకు హాజరుపర్చినట్లు ఆత్మకూరు సీఐ సంతోశ్ తెలిపారు. మండలానికి చెందిన శిక్ష పడ్డ ఖైదీలు మాడిశెట్టి రాజమల్లు, బండి మొగిలి, మాడిశెట్టి రమేశ్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

నెరవేరనున్న సొంతింటి కల

- గృహప్రవేశానికి ఇందిరమ్మ ఇళ్లు సిద్ధం
- దేశరాజుపల్లిలో 27, కమలాపూర్‌లో ఆరు ఇళ్లు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

కమలాపూర్: దశాబ్ద కాలానికి పైగా తమ సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందా అని ఎదురుచూస్తున్న నిరుపేదల కల ఎట్టకేలకు నెరవేరుతోంది. సుమారు 21 నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇంటిస్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు కట్టివ్వాలన్న సంకల్పంతో మొదటి విడతగా నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసింది. ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంతో పాటు మండలంలోని మిగతా గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన ఇళ్లు మంజూరు చేసింది.

గృహప్రవేశానికి సిద్ధం

మండలంలోని 24 గ్రామాలకు గాను మొదటి విడతలో ప్రభుత్వం 775 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. అందులో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన దేశరాజుపల్లికి 150, మిగతా 625 ఇళ్లను అన్ని గ్రామాలకు జనాభా ప్రాతిపదికన మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణం చేపట్టగా ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. దేశరాజుపల్లిలో 27 ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తి కాగా, కమలాపూర్‌లో 6 ఇళ్లు పూర్తయి గృహప్రవేశాల కోసం ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం చేపట్టి బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున మొదటి బిల్లు చెల్లించడమే కాకుండా వివిధ దశల్లో ఉన్న ఇళ్లన్నింటికీ ఆయా లెవెల్స్‌ను బట్టి బిల్లులు చెల్లిస్తున్నారు.



దేశరాజుపల్లిలో నిర్మాణం పూర్తయి గృహప్రవేశానికి ముస్తాబైన ఇందిరమ్మ ఇల్లు

ఇల్లు ఇచ్చినందుకు సంతోషం



గతంలో మాకున్న పెంకుటిల్లు శిథిలావస్థకు చేరడంతో కొన్నేళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇల్లు లేనోళ్లకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తమంటే సంబురపడ్డం. ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి మా సొంతింటి కల నెరవేర్చినందుకు సంతోషంగా ఉంది. – నాగుర్ల సమ్మక్క, దేశరాజుపల్లి

లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం



మండలానికి 775 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన దేశరాజుపల్లికి 150 ఇళ్లు, మండలంలోని మిగతా గ్రామాలకు 625 ఇళ్లు మంజూరయ్యాయి. ఆర్థిక ఇబ్బందులు ఉన్న సుమారు 241 మందికి మహిళా సంఘాల ద్వారా రుణాలు కూడా ఇప్పించాం. – గుండె బాబు, ఎంపీడీఓ

భూమయ్య త్యాగాలు నేటితరానికి ఆదర్శం



భూమయ్య స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

- ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి

శాయంపేట : కామ్రేడ్ పరికరాల భూమయ్య చేసిన త్యాగాలు నేటి తరానికి ఆదర్శమని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం భూమయ్య వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని నేరుడుపల్లిలో స్మారక స్తూపం వద్ద భూమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ భూమయ్య ఎంసీపీఐ(యూ) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, నేరేడుపల్లి ఎంపీటీసీగా ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. భూమయ్య తన బాల్యం నుంచే పేద ప్రజల పక్షాన తనదైన శైలిలో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్.రెడ్డి హంస రెడ్డి, సహాయ కార్యదర్శి నీల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు భద్రయ్య, కూసం బుచ్చయ్య, కిషన్, రమేష్, పెద్దిరెడ్డి మహేందర్ రెడ్డి, చిలకల రాజన్న, సీతారాం రెడ్డి, శంకర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములపై విచారణ చేపట్టాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ప్రజాసంఘాల నాయకులు

ఐనవోలు : మండలంలోని వెంకటాపురం రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 324/సీ లో 158.17 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూములను కొంతమంది రాజకీయ, ఆర్థిక పలుకుబడి ఉన్న వ్యక్తులు ఆక్రమించుకొని రెవెన్యూ రికార్డుల్లోకి అక్రమంగా చొరబడ్డారని, తక్షణమే ఈ భూములపై విచారణ జరపాలని కోరుతూ తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు ప్రజా సంఘాల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎదునూరి వెంకట్రాజం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ 15 ఏళ్లుగా గ్రామంలోని భూమిలేని నిరుపేదలు ఇట్టి సాగుకు యోగ్యమైన ప్రభుత్వ భూమిని తమకు కేటాయించాలని కోరుతూ అనేక రూపాల్లో ఆందోళనలు చేపట్టారన్నారు. అయినప్పటికీ కొంతమంది రెవెన్యూ అధికారులు ఈ విలువైన భూములు ఆక్రమణకు గురికావడానికి సహకరించారని ఆరోపించారు. ఈ భూముల విషయంలో జరిగిన అంశాలను విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు నాయకులు విజ్ఞప్తి చేశారు. రికార్డుల్లో లేనటువంటి వ్యక్తి భూమిని రిజిస్ట్రేషన్లు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు స్పందించకుంటే రానున్న అసెంబ్లీ సమావేశాల్లో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ద్వారా అసెంబ్లీలో ప్రస్తావించి చర్చ జరిగేలా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ విక్రమ్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకట్రాజం, సారంగపాణి

అందుబాటులో యూరియా

శాయంపేట : మండలంలో యూరియా అందుబాటులో ఉందని రైతులు అధైర్య పడొద్దని ఏఓ గంగాజమున అన్నారు. బుధవారం మండలంలోని గట్లకానిపర్తిలోని శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్‌లో 10 టన్నుల యూరియా స్థానిక సాయి ఫెర్టిలైజర్స్ లో 15 టన్నుల యూరియా దిగుమతి చేసినట్లు ఆమె తెలిపారు. గురువారం ప్రగతి సింగారంలోని ఓడీ ఎంఎస్ కు 10 టన్నులు, జోగంపల్లిలోని ఓడీఎంఎస్ కు 10 టన్నుల యూరియా దిగుమతి చేస్తామని తెలిపారు. అవసరం ఉన్న రైతులు తీసుకోవాలని ఆమె కోరారు.

డీజిల్ లేక రోడ్డుపైనే ఆగిన జీపీ ట్రాక్టర్



శాయంపేట : మండలంలోని వసంతాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో చెత్తను డంపింగ్ చేయడానికి వినియోగించే మినీట్రాక్టర్ వారం రోజుల క్రితం గ్రామ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్‌కు చెత్తను తరలిస్తున్న క్రమంలో డీజిల్ అయిపోయింది. ఊరు బయట రోడ్డుపై ఆగడంతో మల్టీపర్పస్ సిబ్బంది ట్రాక్టర్ అక్కడే వదిలేయడంతో 'సాక్షి' క్లిక్ మనిపించింది. మండల అధికారులు చొరవ తీసుకొని గ్రామం బయట ట్రాక్టర్‌ను డీజిల్ పోయించి చెత్తను సరఫరా చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



శాయంపేట : ఎండలో యూరియా కోసం క్యూలో రైతులు



ఐనవోలు : రైతు వేదికవద్ద బారులుదీరిన రైతులు

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో గంగిరేణిగూడెం, ప్రగతి సింగారం గ్రామాలకు బుధవారం యూరియా పంపిణీ చేస్తున్నారని మంగళవారం అర్ధరాత్రి నుంచి పట్టా పాస్ బుక్కులు ఆధార్ కార్డు జిరాక్స్‌లతో రైతులు, మహిళా రైతులు, 90 ఏళ్ల వృద్ధ రైతు సైతం పడిగాపులు కాశారు. ఉదయం మొదలైన యూరియా పంపిణీ మొదలు గంగిరేణిగూడెంలో పంపిణీ చేశారు. మధ్యాహ్నం ప్రగతి సింగారం గ్రామానికి చెందిన ఆడ, మగ రైతులు క్యూలో యూరియా కోసం పడిగాపులు కాశారు. 90 ఏళ్ల వృద్ధుడు బోనపెల్లి వీరమల్లారెడ్డి, 80 ఏళ్ల వృద్ధుడు గండ్ర కోట సమ్మయ్య క్యూలో సాయంత్రం వరకు నిల్చొని యూరియా బస్తాలు తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియా బస్తాలను కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని రైతు దాసరి లక్ష్మారెడ్డి తెలిపారు. రైతులకు క్యూలో లేకుండా బస్తాలను పంపిణీ చేయాలని కోరారు.

ఐనవోలు : మండలంలో యూరియా కొరత కొనసాగుతూనే ఉంది. బుధవారం ఐనవోలులో యూరియా ఇస్తున్నారన్న సమాచారం మేరకు పున్నేలు గ్రామంతో పాటు ఇతర గ్రామాల రైతులు ఉదయం 7 గంటలకే రైతు వేదిక వద్ద బారులుదీరారు. కేవలం పది టన్నులు 220 బస్తాల యూరియా మాత్రమే అందుబాటులో ఉండగా లైన్‌లో ఉన్న రైతులకు ఒక బస్తా చొప్పున ఇచ్చారు. యూరియా కోసం లైన్‌లో ఉన్నా దొరకక పోవడంతో కొంతమంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.



నడికూడ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిషన్‌రావు

కొరత లేకుండా చూడాలి

నడికూడ : యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నందున అధికారులు స్పందించి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు, నాగేష్ కోరారు. బుధవారం తహసీల్దార్ పి.రాణికి వినతిపత్రం అందజేశారు.

మార్కెట్ కమిటీ సభ్యుల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన సుకినె సంతాజీ, వైస్ చైర్మన్‌గా భీమదేవరపల్లి మండలం ముస్తాఫాపూర్ గ్రామానికి చెందిన బొక్కల స్రవంతి ఎన్నికయ్యారు. వీరితో పాటు సభ్యులుగా గొడిశాల రాజయ్య, దాట్ల ప్రవీణ్, బచ్చు బాబురావు, మంతుర్తి రాజయ్య, గనబోయిన కొమురయ్య, శ్రీరామోజు మొండయ్య, జోడుముంతల వెంకటస్వామి, షేక్ హకీంపాషా, మాలోతు జగన్, బండి సుధాకర్ బాధ్యతలు చేపట్టారు. కాగా వీరికి భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణను ఓర్వలేకనే ఆరోపణలు

శాయంపేట : కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల నాయకుడు మసికే కుమారస్వామి అన్నారు. బుధవారం మండలంలోని మైలారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైలారం బీఆర్ఎస్ నాయకులు ప్రజాప్రతినిధుల ముసుగులో ఎన్నో అక్రమాలు చేశారని దుయ్యబట్టారు. ఏ నక్ష ప్రకారం రోడ్డు పనులు చేసినా అభ్యంతరం లేదని, పనులు అడ్డుకున్నామనడం అవాస్తవమని తెలిపారు. ప్రతిపక్ష నాయకులుగా ప్రజాసమస్యలపై గొంతెత్తితే స్వాగతిస్తామని, చిల్లర రాజకీయాలు మానుకోపోతే తరిమికొడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మామిడిపల్లి సాంబయ్య, ఏనుగుల అశోక్, అరికెల్ల సుధాకర్, మోత వెంకటేశర్లు, జక్కుల సంపత్, పల్లెబోయిన రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత కుమారస్వామి

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

దామెర : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాకారుల ఎంపికలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై పాల్గొని మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. జిల్లాకు ఎంపికైన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం 14, 17 ఏళ్ల బాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మడి కల్పన, ఎంఈఓ లకావత్ రాజేశ్ కుమార్, ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరీ మల్యాల దేవేందర్, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ఆత్మకూరు : ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి స్వాతి అన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. అలాగే గుడెప్పాడ్ శివారులోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్యసిబ్బంది వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. టీజీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల నుంచి ఏడుగురిని వైద్యపరీక్షల నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు డాక్టర్ స్వాతి తెలిపారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నర్సింగరావు, సీహెచ్ఓ జునేది, వైద్య సిబ్బంది సంపత్, ఎల్లమ్మ, అనిల్‌కుమార్, సునీత, సరిత, మాధవి, వసంత, తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

చాకలి ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



ఎల్కతుర్తి : జీల్గులలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



శాయంపేట : పూలమాల వేస్తున్న మాజీ జెడ్పీటీసీ నారాయణ రెడ్డి



ఆత్మకూరు : నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ అనిత



నడికూడలో..

చాకలి ఐలమ్మ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని పలువురు వక్తలు కొనియాడారు. జిల్లాలో బుధవారం ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి ఐలమ్మని అన్నారు. అణ గారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగం అమూల్యమైందని పేర్కొన్నారు. రజక సంఘం నాయకులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



పరకాలలో..



ఐనవోలు : కొండపర్తిలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బొక్కల నారాయణ



దామెరలో : ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు



కమలాపూర్ : ఐలమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న సీఐ, తదితరులు

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తిపంటను పరిశీలిస్తున్న అధికారులు

దామెర : పత్తి పంటలో రసంపీల్చే పురుగుల నివారణ కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ అల్లె రాకేశ్ అన్నారు. మండలంలోని ఊరుగొండలో బుధవారం పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రసంపీల్చే పురుగు నల్లి ఉధృతిని గమనించారు. రసంపీల్చే పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్, మోనోఫాస్ 400 మి.లీ లేదా థయోమిథాక్జామ్ చకోర 100 గ్రాములు, వేపనూనె 100 గ్రాములు, లేదా ఎసిఫేట్, ఇమిడాక్లోప్రిడ్ 1.8 లాన్సర్ గోల్డ్ 600–800 గ్రాములు, వేపనూనె 1500 గ్రాములు కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు రామకృష్ణ, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన గాజుల అరుణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. విషయం తెలుసుకొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత సంపత్‌రావు అరుణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అరుణ కొన్నేళ్లుగా ఎస్ఎస్ఆర్ డెయిరీలో పని చేస్తుండడంతో మానవతా దృక్పథంతో స్పందించిన అధినేత నాయినేని సంపత్ రావు రూ. 1 లక్ష విలువ గల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.